అధికారంలోకి రాగానే..
# కేసీఆర్ చర్లపల్లి జైలుకే

పీసీసీ మాజీ అధ్యక్షుడు
పొన్నాల లక్ష్మయ్య



2లో


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 76

శుక్రవారం | 15 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


# మట్టి గణపతికే.. జై





కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్‌తోపాటు పలు నగరాల్లో నిర్వహించిన పరిశోధనల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాలు నీటిలో కరుగకుండా కొన్ని నెలల పాటు అలానే ఉంటూ నీటి ఆమ్లత్వాన్ని పెంచుతున్నాయని, విగ్రహాల సుందరీకరణకు వాడే రంగులు, వార్నీషులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని గుర్తించారు. నీటి ద్వారా మానవుడి శరీరంలోనికి ప్రవేశించిన పీవోపీ అనీమియా, రక్త హీనత, జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపడమే కాకుండా కీళ్ళనొప్పులు, నరాల సమస్యలకు కారణమవుతోందని, 60-70 సంవత్సరాలకు రావలసిన సమస్యలు 30-40 సంవత్సరాలకే వస్తున్నాయంటోంది. ఇలాంటి ప్రమాదకారైన పీవోపీని వదిలి మట్టి గణపతులనే భక్తితో పూజించడం మేలంటున్నారు పర్యావరణ వేత్తలు. మనమూ పర్యావరణహితమైన మట్టి గణపయ్యలకే జై కొట్టాలని 'వరంగల్ వాయిస్ బృందం' పిలుపునిస్తోంది. - వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..

భక్తితో పూజించండి..
పర్యావరణాన్ని కాపాడండి

మట్టి వినాయకులే మేలంటున్న పర్యావరణ వేత్తలు

అవగాహన కల్పించడంలో బల్దియా విఫలం

కొలువుదీరనున్న పీవోపీ విగ్రహాలు

సిద్ధం చేస్తున్న మండపాలు

# మార్మోగిన శోభాయాత్ర

ఆకట్టుకున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్లాటినం జూబ్లీ రిహార్సల్స్

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలు

అధిక సంఖ్యలో తరలి వచ్చిన వాణిజ్య, కర్షక, కార్మిక వర్గాలు



7లో





8లో

కిషన్ రెడ్డికి ఘన స్వాగతం

# మట్టి గణపతికే జై



**భక్తితో పూజించండి..**
**పర్యావరణాన్ని కాపాడండి**
**మట్టి వినాయకులే మేలంటున్న పర్యావరణ వేత్తలు**
**అవగాహన కల్పించడంలో బల్దియా విఫలం**
**కొలువుదీరనున్న పీవోపీ విగ్రహాలు**
**సిద్ధం చేస్తున్న మండపాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గణపతి నవరాత్రులంటే ఊరంతా పండుగే. ఉత్సవ కమిటీలు ఇప్పటికే గణపయ్యను ప్రతిష్ఠించే వేదికలను సిద్ధం చేస్తుండగా.. మరోవైపు తాము నిలబెట్టే వినాయకుడిని కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. తీరొక్క రూపాలతో, వివిధ రంగులతో తయారైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కొనుగోలుకే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. మట్టితో తయారైన విగ్రహాలు చిన్నగా ఉంటాయనే ఆలోచనతో ఉత్సవ కమిటీలు పీవోపీతో చేసిన పెద్ద పెద్ద విగ్రహాలను ప్రతిష్ఠించేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికితోడు మట్టి విగ్రహాల ధరకంటే పీవోపీ విగ్రహాల ధర తక్కువగా ఉండడం, ఆకర్షణీయంగా కనిపించడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. చిన్న పిల్లలు మొదలుకొని ప్రతి ఒక్కరు వారి స్తోమతను బట్టి వివిధ సైజుల్లో ఉన్న విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు చేసి.. తర్వాత నీటిలో నిమజ్జనం చేసే రంగు రంగుల వినయకుడి ప్రతిమలు పర్యావరణానికి మేలు చేస్తున్నాయా లేక హాని కలిగిస్తున్నాయా అనే విషయాన్ని మాత్రం ఉత్సవ కమిటీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని, రాబోవు తరాలు వివిధ రకాల జబ్బులకు గురికావాల్సి వస్తుందన్న ఆలోచన మాత్రం చేయడం లేదు.

### తయారీ సులభంగా..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాల తయారీ సులభంగా, వేగంగా జరగడంతో తయారీదారులంతా దీనికే ప్రాధాన్యం ఇస్తున్నారు. విగ్రహాల తయారీలో నైపుణ్యం ఉన్న రాజస్థాన్ వాసులు మూడు, నాలుగు నెలలు ఇక్కడమే మకాం వేసి వివిధ సైజుల్లో పెద్ద మొత్తంలో విగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహాలు అందంగా కనిపించడానికి రసాయనాలతో మిళితమై ఉన్న రంగులు, చెమ్కీలు, థర్మాకోల్ ముక్కలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. గణపతి నవరాత్రులు ముగిసిన పది, పదిహేను రోజుల్లో దేవి నవరాత్రులు ప్రారంభమవుతున్నాయి. దీంతో గణనాథుడి విగ్రహాల అమ్మకం పూర్తి కాగానే ఇంత భారీ సంఖ్యలో కాకపోయినా వీటికి ఏమాత్రం తీసిపోని విధంగా దుర్గా మాత విగ్రహాలను తయారు చేస్తున్నారు.

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో హాని..

ఏకదంతుడి విగ్రహాల తయారీలో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తోపాటు వివిధ రసాయన రంగులు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. నిమజ్జనం తర్వాత గణపతి విగ్రహాలు నీటిలో కరుగకుండా కొన్ని నెలల పాటు అలానే ఉంటూ నీటి ఆమ్లత్వాన్ని పెంచుతున్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి హెచ్చరిస్తోంది. అదే విధంగా విగ్రహాల తయారీలో వినియోగించే ఇనుము, కాపర్ చెరువులు, నదుల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో అక్కడి నీరంతా కలుషితంగా మారుతోంది. ఆ నీటితో పంటలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కలిసినప్పుడు నీరు ఆమ్ల గుణంలోకి మారుతోందని, దీని ద్వారా మానవులతోపాటు పశు పక్షాదుల జీర్ణవ్యవస్థ, శ్వాస వ్యవస్థ, విసర్జక వ్యవస్థపై ప్రభావం పడుతుందని, మూత్రపిండాలు దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. గాలి ద్వారా పీల్చుకున్నప్పుడు మెదడు డ్యామేజీ అవుతుందని, దాని వలన కోమాలోకి పోయే ప్రమాదం ఏర్పడుతుందంటున్నారు. అనీమియా, రక్త హీనత, జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపడంతో డయేరియా, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని, నీటి ద్వారా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ శరీరంలోనికి పోయి కీళ్ళనొప్పులు, నరాల సమస్యలు ఏర్పడుతాయని, మనకు 60-70 సంవత్సరాలకు రావలసిన సమస్యలన్ని 30-40 సంవత్సరాలకే రావడం మొదలవుతుందని హెచ్చరిస్తున్నారు. కలుషిత నీటి వలన చేపలు, రొయ్యలు వంటి జలచరాలపై ప్రభావం పడుతుందని, వాటిని ఆహారంగా తీసుకునే మనం వ్యాధుల బారిన పడే ప్రమాదముందంటున్నారు.



### మట్టి గణపతులే ముద్దు..

ఈ నేపథ్యంలో పీవోపీ గణపలుతు వద్దు..మట్టి గణపతులే ముద్దంటున్నారు పర్యావరణ పరిరక్షకులు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలగకుండా మట్టి విగ్రహాలను పూజించేలా ప్రజలను మేల్కొలుపుదామని పిలుపునిస్తున్నారు. ఏటా ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పండుగ రోజు ఉచితంగా వాటిని పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షకులుగా మిగిలిపోతున్నారు. మట్టి వినాయకుడి నిమజ్జనం వలన కలిగే లాభాలను ప్రజలకు వివరిస్తున్నారు. విగ్రహం ఎంత పెద్దది అనేది కాకుండా మట్టితో తయారైనదా.. లేదా.. అనే ఆలోచనతో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ పరిరక్షకులు కోరుతున్నారు.

### అవగాహన కల్పించడంలో అలసత్వం..

పర్యావరణంపై ప్రేమతో మొక్కలు నాటుతున్న ప్రభుత్వాలు, ఆ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణానికి హాని కలుగుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేదించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహించడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల్లో పీవోపీ విగ్రహాలతో కలిగే నష్టాలపై చైతన్యం కలిగించడంలో పాలకులు, గ్రేటర్ అధికారులు అలసత్వం వహించడంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తిపేరుతో పర్యావరణానికి విఘాతం కలిగించడం మార్కెట్ మాయాజాలమే అంటూ పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ప్రకృతిని నాశనం చేసే ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, థర్మాకోల్ వంటి వాటిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతయినా ఉందంటున్నారు. చెరువు మట్టి, బంక మట్టితో తయారు చేసిన వినాయకులతో నీరు శుద్ధికావడంతో పాటు నీటిలోని చేపలు, ఇతర ప్రాణులకు ఎలాంటి హాని ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకు వివిధ యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతి సంవత్సరం ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేయడంతో పాటు వాటితో కలిగే లాభాలను వివరిస్తున్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం..

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మట్టి వినాయకులను పూజింద్దాం..పర్యావరణాన్ని కాపాడుదామని వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయ ఎదుట ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్యతోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ రిజ్వాన్ భాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇకో ఫ్రెండ్లీ, ఎంప్లాయిమెంట్ ఫ్రెండ్లీ అనే నానుడితో మట్టి విగ్రహాలతో ప్రజలు గణపతి పూజలు చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వపరంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలలో మంచి స్పందన లభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,000 మట్టి విగ్రహాలు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. స్లమ్ ఏరియాలో కూడా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.



## అధికారంలోకి రాగానే..

# కేసీఆర్ చర్లపల్లి జైలుకే

## పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ ఎర్రబెల్లి ఫామ్ హౌస్ నుంచి డైరెక్ట్ గా చర్లపల్లి జైలుకే పంపిస్తామని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న సమావేశం దేశ, రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా మారనుందన్నారు. ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పురించబోతున్నామని ఆయన ప్రకటించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నట్టేటా ముంచుతున్నారన్నారని మండిపడ్డారు. ప్రజలకోసం, ప్రజా సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం, ప్రజాస్వామ్యం కోసం రాజాకీయాలు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, పీసీసీసభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టీపీసీసీ మాజీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ నసీం జాహన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, జిల్లా ఎన్ ఎస్ యూఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్, జిల్లా ఏఐయూఈడబ్ల్యూసీ అధ్యక్షురాలు గుంటి స్వప్న, ఎస్.టి. సెల్ జిల్లా అధ్యక్షుడు బాలు నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అంకుష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు, మహమ్మద్ సమద్ బొంత సారంగం, నాగపురి లలిత, కె. ప్రభావతి, డివిజన్ అధ్యక్షుడు నాగపురి దయాకర్, మహమ్మద్ జాఫర్, బి.శ్రీధర్ యాదవ్, శివాజీ, సైండ్ల శ్రీకాంత్, ఎస్.కుమార్ యాదవ్, ఓరుగంటి పూర్ణ, జి.సంగీత్, వల్లపు రమేష్, షేక్ అజ్గర్, కొండా నాగరాజు, దోపతి రవి, కొండుక ప్రదీప్ కుమార్, తాళ్ళపల్లి సుధాకర్, రవి కిరణ్, నాయకులు మంద రాకేశ్, తడక సుమన్ పాల్గొన్నారు.

## అసైన్డ్ భూముల సమస్యను ఎన్నికల అజెండాగా మార్చిన కేసీఆర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు ఇస్తామని ప్రజా ప్రతినిధులతో మాట్లాడి కార్యాచరణ చేస్తామని, అసైన్డ్ భూముల వ్యవహారం జెన్యూన్ విషయమని ధర్మబద్ధమైన ముచ్చట అని ప్రత్యక్షంగా రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు ఇచ్చే విషయంలో చాలా స్పష్టంగా చెప్పి హామీ ఇచ్చి, నేడు పట్టించుకోకుండా ఉండి ఈ విషయాన్ని అటకెక్కించడాన్ని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ తప్పుపట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కొన్ని వేల మంది రైతు కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులు ఇస్తామని చెప్పి అసైన్డ్ భూములను ప్లాట్లుగా చేసి వేలం వేసి రాష్ట్ర ప్రభుత్వం అమ్ముకోవడాన్ని ఆయన తప్పు పట్టారు. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నుంచి భూములు బలవంతంగా గుంజుకొని వాటిని అమ్మి రాష్ట్ర ఖజానాకు మళ్లించడం దుర్మార్గమైన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. రైతు ప్రభుత్వం అని చెబుతూ రైతు భూములను అమ్ముకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే అసైన్డ్ భూములను ప్లాట్లుగా వేలం వేసుడు ఆపి అసైన్డ్ భూములు కలిగిన ప్రతి రైతుకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల సమస్యను పార్టీలన్నీ 2023 ఎన్నికల్లో వారి ఎన్నికల ఎజెండాలో పెట్టుకున్నారంటే దానికి కారణం అసైన్డ్ భూమి సమితి యేనని వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ స్పష్టం చేశారు. కేసీఆర్ హక్కులు ఇవ్వకపోవడం వల్లనే ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నాయని కలకోటి మహేందర్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఎన్నికల ఎజెండాగా మార్చుకోకుండా వెంటనే అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు ఇవ్వాలని ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

## ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తులు మానవహారం, ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలో ములుగు ఎమ్మెల్యే సీతక్క పాల్గొని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో గత 11 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న వీరికి, ప్రభుత్వం న్యాయం చేయాలని, అన్ని రకాల ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చినట్లుగా వీరి డిమాండ్లు నెరవేర్చాలని సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులంతా పాల్గొన్నారు.

## అనేక రూపాల్లో ఉన్నా దేవుడు ఒక్కడే



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నియోజకవర్గంలోని అన్ని కులమతాలను తాను సమానంగా గౌరవిస్తానని కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెహ్రూ నాయక్ అన్నారు. చాంప్లతండాకు చెందిన ఫెయిత్ చర్చి నిర్మాణానికి రూ.30 వేల చెక్కును చర్చి పాస్టర్ రాజా రావుకు అందించారు. అనేక రూపాల్లో ఉన్నా దేవుడు ఒక్కడే అన్నారు. దేశంలో మతాల మధ్య కుంపట్లు పెట్టని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా కార్యదర్శి లాలునాయక్, రాజ్ పుత్, జెల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల పోరాటంతోనే నాటి తెలంగాణ విలీనం




### సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, మరిపెడ :** కమ్యూనిస్టుల రైతాంగ సాయుధ పోరాటంతోనే నాటి దొరల, భూస్వాముల, రజాకారుల దాష్టీకాల నుంచి పేద ప్రజలకు విముక్తి కలిగించి తెలంగాణ ప్రాంతం దేశంలో విలీనమైందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సీపీఐ మరిపెడ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 75వ వార్షికోత్సవాల సభ జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన మహెూత్తర పోరాటానికి నాయకత్వం వహించింది సీపీఐ అని, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దూం మొహినుద్దీన్ నాయకత్వాన 4000మంది కార్యకర్తలను బలిదానం గావించి పది లక్షల ఎకరాల భూమిని పంచి, వేలాది గ్రామాలను విముక్తి చేసి రజాకార్ల దొరల దాష్టీకాలకు ఎదురొడ్డి నిలిచిన ఘనత కమ్యూనిస్టుల దేనని వారన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్ గౌడ్, అబ్దుల్ రషీద్, పోలేపాక వెంకన్న, నారాయణ, అంజి, వెంకన్న, కార్తీక్, వెంకటేష్, రమేష్, పి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

### అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** అంగన్వాడీ వర్కర్స్ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తమ మొండి వైఖరిని విడనాడి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మరిపెడ మండల కేంద్రం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ముందు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ నిరవధిక సమ్మె శిబిరాన్ని సీపీఐ నాయకత్వం సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె నోటీసు ఇచ్చి వారి డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన చర్చలు సంప్రదింపులు లేకుండానే మొండి వైఖరిని ప్రదర్శించడంతో సమ్మెకు దిగాల్సి రావడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, రూ.26,000 నెలకు వేతనం ఇవ్వడం లాంటి కోరికలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, పోలేపాక వెంకన్న, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

## బీఎస్పీ మహిళ విభాగం జిల్లా కన్వీనర్‌గా పార్వతి రమేష్ నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బీఎస్పీ మహిళ విభాగం మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ గా మరిపెడ మండలంలోని వెంకట్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ ను నియమించినట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ గతంలో బీఎస్పీ మహిళ విభాగం మరిపెడ మండల కన్వీనర్ గా, ప్రస్తుతం బీఎస్పీ మహిళ విభాగం డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ నిర్మాణంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో పార్టీని బలోపేతం కోసం చురుగ్గా పనిచేస్తున్నందుకు జిల్లా మహిళ కన్వీనర్ గా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ మహిళ జిల్లా కన్వీనర్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో నాకు జిల్లా కన్వీనర్ గా అవకాశం కల్పించిన బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు, నా నియామానికి సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ, వివిధ మండలాల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మహిళ విభాగ రాష్ట్ర ఇంఛార్జి శీలం అనిత రెడ్డికి, రాష్ట్ర మహిళ విభాగ కన్వీనర్ నర్రా నిర్మలకు, అలాగే ఉత్తర తెలంగాణ మహిళ విభాగ కన్వీనర్ అక్కినపల్లీ శిరీషకు, వరంగల్ జోనల్ మహిళ విభాగ కన్వీనర్ అడ్లూరి పద్మకు, జిల్లా మహిళ విభాగ కో కన్వీనర్ నవతకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణకు అసలు వారసులు కమ్యూనిస్టులే

### సీపీఎం సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రానికి అసలు వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు, సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ అన్నారు. శుక్రవారం 31 వ డివిజన్ హంటర్ రోడ్డు లోని ఎమ్మార్ భవన్ లో సౌత్ మండల ప్రజాసంఘాల అధ్యక్ష, కార్యదర్శిల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తరమైన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఏమాత్రం సంబంధంలేని ఆర్ఎస్ఎస్, బీజేపీ రజాకర్లకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారని, ఒక తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందని ఆయన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగినప్పుడు తెలంగాణలో ఆర్ఎస్ఎస్, బీజేపీ వ్యక్తులు ఏ ఒక్కరోజు పోరాటంలో పాల్గొనక పోగా భూస్వామి, నైజం నవాబులకు తొత్తులుగా పనిచేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా ఎన్నో భూ సమస్యలను పరిష్కరించి పేదలకు భూములు పంచిపెట్టిన చరిత్ర ఒక ఎర్రజెండాకు మాత్రమే దక్కుతుందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి మహిళ లోకం ముందుకు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో వేల ఎకరాల భూమిని దొరల నుంచి లాక్కొని పేద ప్రజలకు ఇచ్చిన చరిత్ర ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటూ పేదలపై భారం మోపేలా పాలన కొనసాగస్తున్నాయన్నారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలు అమ్ముతుంటే, బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను అమ్మేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అలకుంటా యాకయ్య, దూడపాక రాజేందర్, నోముల కిషోర్, కంచర్ల కుమరస్వామి, పల్లకొండ శ్రీకాంత్, సాంబరాజు శ్వేతా, భారతి, కుమరస్వామి, రాణి, శోభ, స్రవంతి, చామంతి, కర్ణాకర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ అంటే ప్రతిపక్ష పార్టీలకు వణుకు

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతిపక్ష పార్టీల్లో వణుకు పుట్టిస్తున్నాయని, ప్రతిపక్షాలు విమర్శించే స్థాయి లేకుండా తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగు తున్నాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం సంగెం మండలంలోని లోహిత గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామంలో నాలుగు కోట్ల ఎనభై లక్షలతో లోహిత నుంచి గోపనపల్లి వరకు నూతన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఏడాది మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన 166మంది రైతులకు గాను 15లక్షల పైగా విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. అనంతరం పెద్దతండాలో పర్యటించిన ఎమ్మెల్యే చల్లా బీఆర్ఎస్ హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయని అన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ దే అని కొనియాడారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డ్, అంతర్గత సీసీ రోడ్లు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాలకు మహర్దశ వచ్చిందని అన్ని రంగాల్లో అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. తండాలను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన ఘనత



ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని అన్నారు. తండాలకు ప్రత్యేక నిధులతో తండాలకు, మండలాలకు అనుసంధానంగా ఉండే రహదారులు పునరుద్ధరణ చేసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రశాంతంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ఎవరని కుట్రలు చేసినా ప్రజల్లో ఉన్న ఆదరణతో కేసీఆర్ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, సీఎం కేసీఆర్ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని తీగరాజుపల్లి గ్రామంలో వారు పర్యటించి రైతువేదికలో తీగారాజుపల్లి, సోంమ్లతండా, షాపూర్ గ్రామాలకు చెందిన రైతులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఏడాది మార్చి నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన 473 మంది రైతులకు గాను రూ.44 లక్షల 80 వేల విలువచేసే నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. కుంటపల్లి గ్రామంలోని ఊరచెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. కాట్రపల్లి గ్రామంలో రూ.1 కోటి 5 లక్షలతో కాట్రపల్లి గ్రామం నుంచి వడ్డెరగూడెం వరకు నూతనంగా మంజూరైన బీటీరోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మార్చి నెలలో అకాల వర్షాలకు పంట దెబ్బతిని నష్టపోయిన 484 మంది రైతులకు గాను రూ.56 లక్షలకు పైగా విలువచేసే చెక్కులు వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతులు, బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేపట్టిన బైక్ యాత్రకు శుక్రవారం జాతీయ రహదారిలో పోలీసుల డేగ కన్ను వేశారు. పెంబర్తి నుంచి నిడుగొండ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించడంతో కార్యకర్తల్లో జోష్ నెలకొంది. మండలంలోని నిడిగొండ్ల వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం కార్యకర్తలతో కలిసి ఇక్కడే భోజనం చేశారు. గంటన్నరసేపు కిషన్ రెడ్డి ఉండడంతో రాష్ట్ర నాయకత్వంతో పాటు స్టేషన్ ఘన్ పూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు రఘుపతి, ప్రవీణ్, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బుర్ర నర్సయ్య గౌడ్, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి గుండె విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ నాయకులు బోల్లపల్లి సుభాష్, మండల అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు కవాటి ముత్యాలు, వెంకట్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన అధికార పార్టీ ఎంపీటీసీ భిక్షపతి నాయక్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారత రాష్ట్ర సమితి పార్టీ మేకల గట్టు ఎంపీటీసీ సీనియర్ నాయకులు బానోతు భిక్షపతి నాయక్ శుక్రవారం మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ కండువాకప్పి ఆహ్వానించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ అధికార పార్టీ అరాచకాలు నచ్చక కాంగ్రెస్ పార్టీలో చేరానని, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా, మాజీ జడ్పీటీసీ లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కోళ్ల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత ర్యాలీ



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి:** సీఎం కేసీఆర్ 9 మెడికల్ కళాశాలను ఒకే సారి వర్చువల్ గా ప్రారంభిస్తున్న సందర్భంగా భూపాలపల్లి శాసన సభ సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి అధ్యక్షతన 10000 మందితో భూపాలపల్లి హనుమాన్ ఆలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో ముఖ్య అతిథులుగా మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ వాసు దేవ రెడ్డి, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి రెడ్డి, భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు హింగే మహేందర్ తో పాటు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# గణేష్ మండపం నిర్వాహకులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని వివిధ గ్రామాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in/index.htm వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ కోరారు. గణేష్ మండప నిర్వాహకులు ఆన్ లైన్ ఫామ్ లో విగ్రహం పెట్టే స్థలం, విగ్రహం ఎత్తు, ఏరోజు ఏ ప్రదేశంలో నిమజ్జనం చేస్తారు అనే వివరాలు నమోదు చేయాలని తెలిపారు. దీంతో పోలీసులకు బందోబస్తు, నిమజ్జన ఏర్పాట్లు చేయడానికి వీలు ఉంటుందని, కాబట్టి ప్రతి ఒక్క మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో విష పురుగుల సంచారం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మాణిక్యపూర్ గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో పాములు తిరగుతుండటంతో పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. హైస్కూల్ గ్రౌండ్‌లో పెట్టిన హరితహారం మొక్కలతో విషపురుగులు, కుక్కలు సంచారంచేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దయచేసి గవర్నమెంట్ స్కూల్లో ఉన్న హరితహారం చెట్లను తొలగించాలని కోరుతున్నారు. గతంలో మండల అధికారులకు వినతిపత్రం అందజేసిన పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రేపు తహసీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, రేగొండ :** రాష్ట్ర ప్రభుత్వంచే నూతనంగా ఏర్పాటు చేసిన కొత్తపల్లిగోరి మండల రెవెన్యూ కార్యాలయం శనివారం రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రేగొండ తహసీల్దార్ సత్యనారాయణ స్వామి తెలిపారు.. నూతనంగా ఏర్పాటైన గోరుకొత్తపల్లి మండలంలో త్వరలోనే అన్ని కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందేలా చేయడం జరుగుతుందన్నారు. గోరి కొత్తపల్లి మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్న దృష్ట్యా మంత్రి సత్యవతి రాథోడ్ తో పాటు, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొంటున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్వో సత్యనారాయణ స్వామి కోరారు.

# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ (కరీంనగర్ స్కూల్ కు) ఎంపికయ్యారు. భీమదేవరపల్లి గ్రామానికి చెందిన ఎల్కపల్లి సంతోష్ కుమార్, కొప్పుర్ గ్రామానికి చెందిన గద్ద భరత్ లు ఎంపిక అయినట్టు కోచ్ పి.సునీల్ కుమార్ పీఈటీ కొత్తకొండ తెలిపారు. ఈ విద్యార్థులకు స్థానిక ఎస్సై సాయిబాబు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కార్యాచరణ రూపొందిచుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్పోర్ట్స్ స్కూల్ నిర్వహించిన అన్ని టెస్ట్ ల్లో అత్యంత ప్రతిభ కనబరిచి కరీంనగర్ లోని స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు ఎస్ రవీందర్, ఎ.శ్రీనివాస్, ఎం.కరుణాకర్, బాలరాజ్, శ్రీకాంత్, తల్లితండ్రులు ఆనంద్(తిరుపతి) శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** పరకాల హనుమకొండ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఎస్సై దేవేందర్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది శుక్రవారం గుంతలను పూడ్చారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారిపై చాలా గుంతలు ఏర్పడడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన పోలీసులు మాందారిపేట నుంచి కొత్తగట్టు సింగారం వరకు డస్టుతో గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా పోలీసులు చేసిన ఈ పనికి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజీపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 62వ డివిజన్ నాయకులు రైతు సమన్వయ కమిటీ మెంబర్ చుంచు కృష్ణ, ఆర్టీఏ మెంబర్ కాటాపు రాజ్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్ ల ఆధ్వర్యంలో 62వ డివిజన్ లోని బీజేపీకి చెందిన హనుమకొండ జిల్లా కన్వీనర్ హిరగాని హరిప్రసాద్, మోర్చా అధ్యక్షురాలు ఎండీ షమీనా, 62వ డివిజన్ బీజేపీ యూత్ అధ్యక్షుడు మహేష్, బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని దాస్యం విజయ్ భాస్కర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, సంక్షేమ ఫలాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అందుకు బీఆర్ఎస్ లో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు, నార్లగిరి రమేష్, మిట్టపల్లి రవీందర్, వేనిశెట్టి రఘు, ఎండి సోనీ, బెదరకోట రంజిత్, బసవ యాదగిరి, పి.రామస్వామి, ఏ.శంకరమూర్తి, సయ్యద్ సర్వర్, బండి రామచందర్‌పాల్గొన్నారు.

## గౌడ మేధావులు మౌనం వీడాలి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గీత కార్మికులకు గౌడ మేధావుల తోడ్పాటు అవసరమని, గౌడ మేధావుల మౌనం గీత కార్మికులకు శాపం కారాదని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి, సోషల్ మీడియా కన్వీనర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. కన్నతల్లి లాంటి వృత్తి అంతరించిపోతుందని తాతలు, తండ్రులు ఈ వృత్తిపై జీవనం సాగిస్తేనే మనం వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి తల్లి లాంటి వృత్తి ఆధరణ, ఆధునికీకరణ లేక, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రమాదపు అంచున ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత ప్రమాదకరమైన వృత్తి కావడం, ఏడాది పాటు వృత్తిలో మనుగడ లేకపోవడంతో గీత కార్మికులు, వారి కుటుంబాలు గీత వృత్తికి దూరమవుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. గౌడ మేధావులు వారిదైన శైలిలో గీత కార్మిక వృత్తిలోని సమస్యలపై నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ గీతా కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడాలని ఆయన కోరారు. ప్రతి ఉద్యమంలోనూ, హక్కుల సాధనలో పాత్రికేయుల సేవలు మరువలేనివి. అటువంటి పాత్రికేయులు గౌడ కులంలో ఎక్కువ సంఖ్యలో ఉండడం సంతోషకరమన్నారు. ఎన్నో ఉద్యమాలలో హక్కుల సాధనకు వారి రచనలు, కథనాలతో సమస్యలకు పరిష్కారం చూపుతూ కార్మికుల జీవితాలలో వెలుగు నింపుతున్న పాత్రికేయులు అంతరించిపోతున్న తమ తల్లి లాంటి వృత్తిని, వృత్తిని చేస్తున్న గీత కార్మికుల సమస్యలను కలం పోటుతో నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతూ గీత వృత్తిని కాపాడే దిశగా, గీత కార్మికులకు వెన్నంటి ఉండాలని ఆయన ప్రాధేయపడ్డారు. గౌడ కులంలో ఉన్న పారిశ్రామికవేత్తలు, ఉన్నత వర్గాలు రాజకీయ నేతలు, వివిధ వర్గాలు వృత్తిని, కార్మికుడిని కాపాడే దిశగా గ్రామాలను ఎంపిక(దత్తత) చేసుకొని తాడి, ఈత, ఖర్జూర, గిరక చెట్లను, హైబ్రిడ్ రకాలను వివిధ గ్రామాలలో నాటి, వాటి సంరక్షణ చూసుకోవాలని కోరారు. కల్లుకు, నీరాకు మంచి మార్కెట్ వచ్చేలా చూడాలని, వృత్తి రక్షణకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి గీత కార్మిక కుటుంబాలలో వెలుగులు నింపాలని ఆయన కోరారు.

# ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

### అంతర్ రాష్ట్ర సరిహద్దు పోలీసు అధికారుల సమావేశం




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలంగాణ, ఛత్తీస్గడ్, మహారాష్ట్ర పోలీసు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జెన్కో కాన్ఫరెన్స్ హాల్ లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల (గడ్చిరోలి, బీజాపూర్, తెలంగాణ వివిధ జిల్లాల పోలీసు అధికారులు) సమన్వయ సమావేశం, అంతర్ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల కదలికలు, ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ముఖ్యంగా మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం చేరవేర్చుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందని ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఐజీ, రామగుండం సీపీ రెమో రాజేశ్వరి, మూడు రాష్ట్రాల పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల దృష్ట్యా రాష్ట్రాల సరిహద్దులో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయటంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్ కు సంబంధించి అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా చర్యలతో పాటు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా పనిచేయాలని, అలాగే మూడు రాష్ట్రల పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకొంటూ సాఫీగా ఎన్నికలు సాగేలా చూడాలని అన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలతో సరిహద్దులో ఉన్న సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్ బీడబ్ల్యూ వారెంట్స్ ల విషయంలో మూడు రాష్ట్రాల పోలీసులు ఒకరికొకరు సహకరించుకోవాలని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని డీఐజీ, రామగుండం సీపీ రాజేశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్, ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్ కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మంచిర్యాల్ సుధీర్, ఆర్ కేకెన్ ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఎస్పీ బీజాపూర్, అడిషనల్ ఎస్పీ బీజాపూర్, ఎస్పీ గడ్చిరోలి, డీఎస్పీ సిరోంచ, ఏసీపీ హుజరాబాద్ జీవన్ రెడ్డి, భూపాలపల్లి కాటారం డీఎస్పీలు ఏ రాములు, జి.రామ్మోహన్ రెడ్డి, మూడు రాష్ట్రాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ ఝాన్సీనగర్ లో రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్లు పూర్తిగా విలీన గ్రామాలతో నిండి ఉన్నాయని తెలిపారు. విలీన గ్రామాల అభివృద్ధికి అత్యధిక నిధులు వెచ్చించి గ్రామాలలో పట్టణ వాతావరణం ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వానికి విద్యార్థుల దీక్షలు కనిపించట్లేదా..

### కేయూ వీసీ రిజిస్ట్రార్లను భర్తరఫ్ చేయాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** యూనివర్సిటీ విద్యార్థి, ఉద్యోగ ఉపాధ్యాయుల వ్యతిరేకులు కేయూ వీసీ, రిజిస్ట్రార్లు అని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్స్ వెంకట్ నారాయణ, యాదగిరిలు అన్నారు. 10వ రోజు దీక్షలను కేయూ ఎన్జీవో, నాల్గోవ తరగతి ఉద్యోగులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేయూ ఎన్జీవో ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల తిరుపతి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో క్యాటగిరి 2 పీహెచ్ డీ ఫలితాల్లో జరిగిన అవినీతి పైన ప్రశ్నించిన విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి పోలీసుల చేత దాడి చేయించిన కేయూ వీసీ రిజిస్ట్రార్లను రాష్ట్ర ప్రభుత్వం భర్తరఫ్ చేయాలని గత పది రోజుల నుంచి దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. యూనివర్సిటీలో వీసీ రిజిస్ట్రార్ లు విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటం ఆడుతూ యూజీసీ రూల్స్ ను బ్రేక్ చేస్తూ క్యాటగిరి 2లో అధిక శాతం పార్ట్ టైం వాళ్లకు పీహెచ్ డీ ఇవ్వడం అవినీతి కాదా అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా విడతల పేరుతో గోసపుచ్చుకుంటుంది నిజం కాదా అన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రమోషన్స్ లో అన్యాయం చేసింది కేయూ వీసీ, రిజిస్ట్రార్లు కాదా, ఎన్జీవో ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ నెరవేర్చకుండా ద్రోహం చేస్తుంది మీరు కాదా అని మండిపడ్డారు. ఇప్పటికైనా నిరంకుశ వైఖరి మార్చుకొని తక్షణమే విద్యార్థి, ఉద్యోగుల డిమాండ్స్ నెరవేర్చకుండా కాలయాపన చేస్తే ఉద్యమమం మరో రూపంలోకి మారుతుందని హెచ్చరించారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్స్ వెంకట్ నారాయణ, యాదగిరిలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా తాత్సారం చేయడం మూర?త్వం అని దుయ్యబట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చేస్తున్న న్యాయ పరమైన పోరాటానికి మద్దతు పలకాల్సింది పోయి, కొంత మంది యూనివర్సిటీ ఉద్యోగులు వారి స్వార్థ అవసరాల కోసం వీసీకి వత్తాసు పలుకుతూ విద్యార్థుల పోరాటాన్ని నిర్వీర్యం చేసే సందేశాలు పంపడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. దీక్షలో గాయపడ్డ విద్యార్థులు అంబాల కిరణ్, మాచర్ల రాంబాబు, అరెగంటి నాగరాజు, మట్టెడ కుమార్ లు ఉన్నారు. 10వ రోజు దీక్షలో పాల్గొన్న విద్యార్థి నాయకులు తిరుపతి యాదవ్ కేయూ జాక్ చైర్మన్, డా.మంద వీరస్వామి కేయూ జాక్ వ్యవస్థాపక సభ్యుడు, మేడ రంజిత్ కుమార్ టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మొగిలి వెంకట్ రెడ్డి పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి, నిమ్మల రాజేష్ ఏబీవీపీ కేయూ ఇంచార్జి, బి.నరసింహ రావు రాష్ట్ర పీడీఎస్ యూ ఉపాధ్యక్షుడు, రాజు నాయక్ గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, తాళ్లపల్లి నరేష్ కుర్మా అధ్యక్షుడు, మార్క కిరణ్, హ్యూమన్ రైట్ ఫోరమ్ అధ్యకుడు హుస్సేన్, కేతపాక ప్రసాద్, కాయిత నాగరాజు, గుండేగ సుమన్ లు దీక్షలో కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా ఎన్జీవో అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు సతీష్, ప్రభాకర్, నాల్గో తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సుక్రు రామనాథంలు పాల్గొన్నారు.

# ఎంఐఎంకు లొంగి సెప్టెంబర్ 17ను సమైక్యతా దినం అంటారా..?

**ధైర్యం ఉంటే తెలంగాణ సాయుధ పోరాట దినంగా జరపండి**

**నిజాంను, కాసీం రజ్వీని కాపాడిన పటేల్ విమోచన కల్పించారా..?**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంఐఎంకు లొంగి సెప్టెంబర్ 17ను సమైక్యతా దినంగా ప్రకటించారని, కేసీఆర్ కు ధైర్యం ఉంటే తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవంగా గుర్తించి అధికారికంగా ఉత్సవాలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని హరిత హోటల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని, హైదరాబాద్ సంస్థానంలో నిజాం పీడ తొలగకపోవడం వల్లనే సీపీఐ తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని చెప్పారు. దాంతో నిజాంకు గత్యంతరం లేకనే కేంద్రంలోని పటేల్ ప్రభుత్వానికి లొంగిపోయారని, అప్పటికే తెలంగాణలోని భూస్వాములు, దేశ్ ముఖ్ లు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్లారని తెలిపారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ నాయకులు హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నారని, అసలు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలోనే మఖ్దుం మొయినుద్దీన్ ఉన్నారని, ఆ పోరాటంలో షేక్ బందగీ, షోయాబుల్లా ఖాన్ లాంటి ఎందరో ముస్లింలు చనిపోయారని అన్నారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సాయుధ పోరాటం పేరెత్తకుండా ఎంఐఎంకు భయపడి సెప్టెంబర్ 17న సమైక్యతా దినోత్సవం పేరుతో వేడుకలు జరుపుతున్నారని, కేసీఆర్ కు ప్రజలపై ప్రేమ ఉంటే తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ పోరాటంలో అసువులు బాసిన కమ్యూనిస్టు వీరులను గుర్తించి గౌరవించాలని, ఎంఐఎం ఒత్తిడికి లొంగవద్దని సూచించారు. హైదరాబాద్ కు వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా దీనిని భూస్వాములపై జరిగిన పోరాటమేనని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

**జమిలి పేరుతో బీజేపీ డ్రామా..**

జమిలి ఎన్నికల పేరుతో బీజేపీ పెద్ద డ్రామా ఆడుతున్నదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పార్లమెంటు ఎన్నికలలో గెలవలేమన్న భయంతోనే జమిలికి తెర లేపారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక, కర్ణాటక ఎన్నికలతోనే బీజేపీ ప్రభంజనం ఆగిందని, రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలోనూ బీజేపీ గెలవదని అన్నారు. అందుకే జమిలి పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, జమిలి ఎన్నికలు రాజ్యాంగ, ప్రజాస్వామ్య విరుద్ధమని చెప్పారు.

**విమర్శల నుంచి తప్పించుకొనేందుకే కవితకు నోటీసులు..**

కేంద్రంలో, రాష్టాల్లో ప్రతిపక్షాలను అణిచివేసే రాజకీయాలు నడుస్తున్నాయని, వాటిని తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. ఏపీలో చంద్రబాబు అరెస్టు విషయంలోనూ ఇదే జరిగిందని, ఎమ్మెల్సీ కవితపై ఆరోపణలు ఉంటే ఇన్ని రోజులుగా ఎందుకు ఆగారని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయనే విమర్శలు తప్పించుకునేందుకే కవితకు మళ్లీ నోటీసులు పంపారని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.వెంకట్రాములు, నేదునూరి జ్యోతి, హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లా కార్యదర్శులు కర్రె భిక్షపతి, మేకల రవి, తోట మల్లికార్జున రావు, రాష్ట్ర నాయకులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, దుప్పటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

**తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ రావు**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ నూటెంకి**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా జర్నలిస్టులు అనసూయ పడుతున్నారని, అందుకు అనుగుణంగా విభిన్న కార్యక్రమాలతో జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యాచరణ ప్రణాళికలు చేపట్టబోతున్నట్లు తెలంగాణ స్టేట్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు హెల్త్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాల కోసం పోరాడుతామని చెప్పారు. అయితే గతంలో ఉన్న ఫెడరేషన్ లో కొద్దిగా మార్పులు చేసి ప్రస్తుతం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గా మార్చడం జరిగిందని అన్నారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూటెంకి ప్రభాకర్ ను నియమించడం జరిగిందని జితేందర్ రావు చెప్పారు. అలాగే ఈ ఫెడరేషన్ లో ఉన్న కొంతమంది సభ్యులను నూతనంగా చేర్చుకొని రాష్ట్ర బాధ్యులతో పాటుగా ఆయా జిల్లాల బాధ్యతలను కూడా అప్పగించడం జరిగిందని జితేందర్ రావు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా ఆయా జిల్లా పాత కమిటీలతో పాటుగా లేని జిల్లాలలో కొత్త కమిటీలను ఏర్పాటు చేసి ఫెడరేషన్ బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కొత్తగా నియమించిన రాష్ట్ర బాడిని ఆయన ప్రకటించారు.

# పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఆర్.ఉపాకర్ రెడ్డి పాఠశాల మీద ఉన్న మమకారంతో శుక్రవారం పాఠశాలకు సౌండ్ సిస్టంకు సంబంధించిన అహుజా కంపెనీ ఆమ్లిఫైర్ దాదాపు రూ.15వేల విలువ గల వస్తువును కొనుగోలు చేసి బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ ఇనాయత్ అక్తర్ లకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ అక్తర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు గాని దాతలు ఎవరైనా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

# మట్టి గణపతి విగ్రహాలపై అవగాహన ర్యాలీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని రెడ్డి కాలనీ ఏకశిలా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు మట్టి గణపతుల ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాబోయే వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజించాలని, పర్యావరణానికి హాని జరగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యత కూడా తెలిసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రసాయనాలు వాతావరణాన్ని, నీటిని కలుషితం చేస్తాయని, కాబట్టి రసాయనాలతో కూడిన విగ్రహాలను కాకుండా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని "పర్యావరణాన్నిరక్షిద్దాం...మట్టి గణపతులనే పూజిద్దాం" అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్నా రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, స్వామి, పవన్, హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బాలాజీ విద్యాసంస్థల వారి అస్మాక హైస్కూల్ లో విద్యార్థినీ విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్ర ప్రసాద్ రెడ్డి పాల్గొని మట్టి వినాయకులను తయారు చేసి పూజించడం వలన పర్యావరణానికి ఏ విధమైన హాని కలగకుండా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మికి ఏజెంట్‌ను పెట్టుకున్న ఎంపీడీవో




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి గ్రామంలో గృహలక్ష్మి పథకానికి దాదాపు 300మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 240మంది ఆన్ లైన్ లో ఉన్నారని, ఆ అర్హుల జాబితా కూడా నా దగ్గర లేదని గ్రామ కార్యదర్శి ప్రజలకు చెపుతున్నాడని చర్లపల్లి సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి అన్నారు . ఆయన మాట్లాడుతూ అర్హుల జాబితా ఎవరి దగ్గర ఉందని అడిగితే గ్రామంలో ఒక వ్యక్తి దగ్గర ఉందని, అక్కడికి వెళ్లి ఆ జాబితాలో మీ పేరు ఉందో లేదో తెలుసుకోమని సూచించారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శిని నిలదీయడంతో ఎంపీఓ, ఎంపీడీవో నాకు లిస్టు ఇవ్వలేదని తెలిపారు. ఎంపీడీవోను వివరణ కోరగా మీ గ్రామంలో ఒక మధ్యవర్తి దగ్గర ఉందని దాట వేశారని అన్నారు. సెప్టెంబర్ 13(బుధవారం) పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా తుది జాబితా లేకుండా ఆ సమావేశానికి ఎంపీడీవో, కార్యదర్శి ఎలా పాల్గొన్నారని అన్నారు. మధ్యవర్తి (దళారి)నుంచి చర్లపల్లి గ్రామ ప్రజలను కాపాడాలని డిప్యూటీ కలెక్టర్ కు పత్రికా ముఖంగా చర్లపల్లి గ్రామ సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి కోరారు.

# టెట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** టెట్ పరీక్ష కేంద్రాలను శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ సందర్శించారు. ఉదయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, మహర్షి విద్యాలయం కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ పాల్గొన్నారు.

# గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లైను కలిసిన పీఐబీ ప్రెస్ బృందం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్ళైను మర్యాదపూర్వకంగా పీఐబీ ప్రెస్ బృందం కలిశారు. హైదరాబాద్ లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ)ప్రాంతీయ కార్యాలయం తలపెట్టిన ప్రెస్ టూర్ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఎనిమిది మంది జర్నలిస్టుల బృందం ముంబై, గోవాలో పర్యటించారు. శుక్రవారం ఉదయం గోవా రాజ్ భవన్ లో గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్ళైను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రెస్ బృందంతో గవర్నర్ పలు అంశాలపై సూచనలు చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఐబీ అధికారులు డా.మానస్ కృష్ణ కాంత్, శ్రీశివచరణ్ రెడ్డితో పాటు వరంగల్ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ రోజనాల శ్రీనివాస్ గవర్నర్ ను కలిసిన బృందంలో ఉన్నారు. ప్రెస్ బృందంతో గవర్నర్ పలు అంశాలపై సూచనలు చేశారు.

# నభూతో నభవిష్యత్



## కన్నుల పండువగా చాంబర్ ఆఫ్ కామర్స్ శోభాయాత్ర

### ఆకట్టుకున్న డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలు

### అధిక సంఖ్యలో తరలి వచ్చిన వాణిజ్య, కర్షక, కార్మిక వర్గాలు

### ప్లాటినం జూబ్లీ వేడుకలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ 75 వసంతాల ప్లాటినం జూబ్లీ వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర, బైక్ ర్యాలీ 'నభూతో.. నభవిష్యత్' అన్న రీతిలో చాంబర్ ప్రధాన కార్యాలయం వరకు సాగింది. 1948వ సంవత్సరములో వర్తక సంఘం పేరుతో తొలి అడుగు వేసి తర్వాత వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీగా మార్చుకుని 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటున్న శుభ సందర్భంలో శుక్రవారము ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ లోని శ్రీ లక్ష్మి గణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవాలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు, చాంబర్ మాజీ అధ్యక్షులు తుమికిరమేశ్ బాబు, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, దిడ్డి కుమారస్వామి సమక్షములో నిర్వహిస్తున్న శోభయాత్రను జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ఇన్నారపు మల్లేశం, మామునూర్ ఏసీపీ వి.సతీష్ బాబు, మట్వాడ ఏసీపీ బి.కిషన్, వ్యవసాయ మార్కెట్ సెలక్షన్-గ్రేడ్-సెక్రటరీ వెంకటేశ్ రాహుల్ జెండా ఊపి ప్రారంభించారు.

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ నుంచి మొదలైన ఈ శోభాయాత్ర కాశిబుగ్గ చౌరస్తా, పోచమ్మ మైదాన్, మండిబజార్, జేపీఎన్ రోడ్, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీసు, రైల్వే స్టేషన్ మీదిగా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యాలయము వరకు సాగింది. ఈ శోభాయాత్రలో వరంగల్ నగర కాశిబుగ్గ బట్టలు వర్తక సంఘం, దేశాయిపేట రోడ్ వర్తక సంఘం, శివా పేపర్ మార్ట్, బ్రాస్ అండ్ స్టీల్ వర్తక సంఘం, ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్, ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రికల్ మర్చంట్స్ అసోసియేషన్, వరంగల్ హాస్పిటల్ మేనేజ్మెంట్, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజ్మెంట్, ఇతర వ్యాపార వర్గాల ప్రజలు స్వాగతాభివందనాలు తెలుపుతూ చాంబర్ అధ్యక్షుడిని పూల బొకేలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ వజ్రోత్సవ శోభాయాత్రను విజయవంతం చేస్తున్న సమస్త వ్యాపారస్తులకు, గుమస్తా, దడువాయి, వివిధ రకాల హమాలీ కార్మిక సోదరులందరికి పేరు పేరునా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ వేడుకలు మనందరి పండుగ అన్నారు. ఐక్యతతో అందరం కలిసి ఇదే విధంగా 30, అక్టోబర్ 1వ తేదీన వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ శోభా యాత్రలో వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, గౌరవ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, ఛాంబర్ మాజీ గౌరవ ప్రధాన కార్యదర్శి గోరంటల యాదగిరి, తోట నర్సింహారావు, ఛాంబర్ కార్యవర్గ సభ్యులు కైలాస హరినాథ్, గౌరిశెట్టి శ్రీనివాస్, సూదాటి రాజేశ్వర్ రావు, గాజుల సుమన్, కంచ సంపత్, కో-ఆప్షన్ మెంబర్ రాయిశెట్టి సత్యనారాయణ, సలహాదారులు భూపతి ప్రభాకర్, వెల్ది చక్రాధర్, పుప్పాల యుగంధర్, ఛాంబర్ అనుబంధ సెక్షన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, గౌరవ సభ్యులు, గుమస్తా, దడువాయి, వివిధ రకాల హమాలీ కార్మిక సోదరులు ఇతర అసోసియేషన్ల ప్రతినిధులు సుమారు 3000 మంది పాల్గొన్నారు.













# ఫ్లాష్ మాబ్ మస్తుగుంది

**ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం**

**17న మెట్టుగుట్టపై స్వచ్ఛతా కార్యక్రమం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ ఇన్సియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంలో 'జాయిన్ ది ఫైట్ ఫర్ గార్బేజ్ ఫ్రీ సిటీస్' అంశంపై జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఎంజీఎం కూడలి, హనుమకొండ లోని అంబేద్కర్ జంక్షన్ ప్రాంతంలో ఫ్లాష్ మాబ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, ఎంజీఎం వొకేషనల్ కళాశాల, ఎల్ బి కళాశాలకు చెందిన ఎన్ సీసీ విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీగా హాజరై ఫ్లాష్ మాబ్ లో పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా బల్దియా పీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ఈ నెల 17 న మెట్టు గుట్టపైనున్న రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఫ్లాష్ మాబ్ లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగర పరిధిలోని యువతీ, యువకులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈ సంజయ్ కుమార్, సూపరిండెంట్ దేవేందర్, ఎస్ ఐలు శ్యామ్ రాజ్, వెంకన్న, గోల్కొండ శ్రీను, భీమయ్య, అనిల్ తో పాటు సిబ్బంది స్వర్జన్ రాజు, అనిల్, గౌతమి, ధనలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.



# కిషన్ రెడ్డికి ఘన స్వాగతం

**వరంగల్ వాయిస్, మడికొండ :** తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ క్లాక్ టవర్ నుంచి పరకాల అమరధామం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కి మడికొండ చౌరస్తాలో ఘనంగా స్వాగతం పలికారు. మార్థినేని ధర్మారావు ఆధ్వర్యంలో మడికొండ బీజేపీ జిల్లా నాయకులు పోనగోటి వెంకట్ రావు, గడ్డం మహేందర్, ముఖ్య నాయకులు గజమాలతో కిషన్ రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్, 46వ డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్, ఎలగొండ శివ, భైరపాక వెంకటేష్, మాదాసు ప్రణయ్, నాగవల్లి గోపికృష్ణ, పల్లపు అశోక్, తక్కలపల్లి నిఖిల్ రావు, గడ్డం కిరణ్, బుర్ర నరేష్, చట్ల అజయ్, పండుగ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజినీర్ల పాత్ర మరువలేనిది

**మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిదని, గత శతాబ్ద కాలంగా దేశం అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందంటే దానికి కారణం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీర్లే కారణమని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ప్రశంసించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నార్త్ లాలా గూడ జెడ్ సీఈటీఐలోని సెమినార్ హాల్ లో శుక్రవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె.రామకృష్ణ, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీడీ మిశ్రా, చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ సీహెచ్ ఎస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరై ప్రాజెక్టు గొప్పతనాన్ని, దానికి సంబంధించిన అనేక విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాళేశ్వరం ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోందంటే అది కచ్చితంగా ఇంజినీర్ల గొప్పదనమే అని కొనియాడారు. సమాజ అభ్యున్నతిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వారు చిత్తశుద్ధితో పనిచేస్తే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయని కార్యక్రమంలో ప్రసంగించిన వక్తలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రాంతాన్ని వరదల నుంచి రక్షించడానికి ప్రత్యేక వ్యవస్థ రూపొందించిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజినీర్లందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో అద్భుత పనితీరు కనబర్చిన ఇంజినీర్లను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కాళేశ్వరం ఈఎన్ సీ నల్ల వెంకటేశ్వర్లును కూడా సత్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డీకొండ పద్మనాభం, ప్రధాన కార్యదర్శి వై.లోకేశ్వర్, ఇతర నాయకుల నేతృత్వంలో జరిగిన ఈ ఇంజినీర్స్ డే వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని వందలాది మంది ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఐదో రోజు అంగన్వాడీల సమ్మె



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ జిల్లా అంగన్వాడి ఉద్యోగుల సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె విజయవంతంగా సాగుతోందన్నారు. మీ జిల్లాలో కూడా సమస్యలు పరిష్కారం అయ్యేత వరకు సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఎండి యాకూబ్ పాషా, జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, నిర్మల, రుక్మిణి, రేణుక పాల్గొన్నారు.

# గత పాలకులు చేయలేని అభివృద్ధి చేసి చూపించాం : ఎమ్మెల్యే నన్నపునేని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో గతంలో ఎన్నడు జరగని, చూడని అబివృద్ధిని చేసి చూపించామన్నారు. డివిజన్ సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని 37వ డివిజన్ ముదిరాజ్ వాడ, యాదవ వాడ, దళితవాడ, పేరుకవాడ, కొత్త గడ్డ, మైనారిటీ కాలనీల్లో కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ తోపాటు అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే గల్లీ గల్లీకి తిరిగారు. ప్రతి ఇంటిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం మార్గం చూపించారు. పూర్తి అయిన, పూర్తి కావల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను పరిశీలిస్తూ, పెన్షన్స్ రాని వారి వివరాలను సేకరిస్తూ, మంచి నీటి సమస్య వెంటనే పరిష్కారం చూపుతూ వాడవాడన ఎమ్మెల్యే కలియతిరిగారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, డివిజన్ అధ్యక్షులు సంగరబోయిన విజయ్, డివిజన్ ఇంచార్జ్ లు, ముఖ్య నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులు డీసీ, జీడబ్లుఎంసీ ఎస్ఈ, ఈఈ, డీఈ, విద్యుత్తు, మున్సిపల్ అధికారులు, పోలీస్, ఇతర అన్ని శాఖల అధికారులు, డివిజన్ యూత్ నాయకులు, పెద్దలు, ప్రముఖులు హాజరయ్యారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** జీహెచ్ఎంసీ చారుబోలి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం విజయవంతమైంది. పిల్లలందరూ ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించడం చూసి ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోయారు. నైన్త్ క్లాస్ అక్షర, టెన్త్ క్లాస్ సభ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.నర్సింగరావు, స్టాఫ్ సెక్రటరీ బండారి గంగాధర్ తిలక్, ఉపాధ్యాయులు పి.అశోక్, ఆర్.హరికృష్ణ, డి.శ్రీనివాస్, రమేష్, స్వప్న, లక్ష్మి, నీరజ, కవిత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com